GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 306 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | బుధవారం 14-2025 | పేజీలు : 3

## 4 రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు



**టీ మీడియా, మే 13,హైదరాబాద్ బ్యూరో :**
గత కొన్ని రోజులుగా ఎండల కారణంగా అల్లాడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించనుంది. రాగల 4 రోజులపాటు ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్? వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో ఆరెంజ్ హెచ్చరికలను జారీచేసినట్లుగా వాతావరణ శాఖ తెలిపింది.

**రాగల నాలుగు రోజులు వర్షాలు**

ఉత్తర దక్షిణ ద్రోణి ప్రభావంతో పాటు ఉపరితల చక్రవాక ఆవర్తనాల ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. వీటితోపాటు క్యుములోనింబస్ మేఘాల కారణంగా పగటిపూట ఎండల తీవ్రత, సాయంత్రం వేళల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది. రాగల నాలుగు రోజుల పాటు ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారి ధర్మరాజు వివరించారు. పశ్చిమ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసినట్టుగా ఆయన వివరించారు. మరోవైపు నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం అవి దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతానికి చేరినట్లుగా భారత వాతావరణ విభాగం(ఐఎండీ) వెల్లడించింది.

# పాక్‌కు దిమ్మదిరిగేలా బుద్ధి చెప్పారు

- భవిష్యత్తు తరానికి మీరంతా ఆదర్శం
- ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన ప్రధాని మోదీ



**టీ మీడియా ,మే 13,ఆదంపూర్ :**
ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించారు. అక్కడి సైనికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత సైనికులను మోదీ అభినందించారు. అలాగే ఆపరేషన్ సింధూర్ గురించి ముచ్చటించారు. అనంతరం సైనికులనుద్దేశించి ప్రసంగించారు. మన సోదరులు, కూతుళ్ల సింధూరాన్ని తుడిచేస్తే.. ఉగ్రవాదుల ఇళ్లల్లోకి దూరి మరీ చంపేస్తామని, భారత సైన్యం ఎదురుగా నిలిచి పోరాడిందని అన్నారు. సైన్యం ఉగ్రవాదుల స్థావరాలను మట్టిలో కలిపేసిందన్నారు. ఉగ్రవాద స్థావరాలతో పాటు 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారని, భారతదేశంలోని సామాన్యుల జోలికి వచ్చినవారికి వినాశనమేనని అన్నారు. మన డ్రోన్లు, క్షిపణులను తలచుకుంటే పాక్‌కు నిద్రపట్టదన్నారు.నేటి నుంచి పదేళ్ల తర్వాత భారత పరాక్రమం గుర్చి చర్చ వస్తే.. మీ అందరి గురించే చర్చించాల్సి ఉంటుందని, భవిష్యత్తు తరానికి మీరంతా సరికొత్త ప్రేరణగా నిలిచారని సైన్యాన్ని కొనియాడారు. ఈ వేదిక మీద నుంచి త్రివిధ దళాలు, బీఎస్ఎఫ్‌కు సెల్యూట్ చేస్తున్నానని, మీ పరాక్రమం కారణంగా ఆపరేషన్ సింధూర్ గురించి యావత్ ప్రపంచం చర్చించుకుంటోందన్నారు. ఈ ఆపరేషన్‌లో భారత సమాజం మొత్తం మీ వెంట నిలిచిందని, భారతీయులందరి మీకోసం ప్రార్థన చేశారన్నారు.భారతీయులందరికీ.. సైనిక బలగాలు, వారి కుటుంబాలపై కృతజ్ఞత ఉందన్నారు. భారతదేశం బుద్ధుడి నేల, అలాగే గురుగోవింద్ సింగ్ నేల కూడా అని వ్యాఖ్యానించారు. అణుబాంబు హెచ్చరికలను భారత సైన్యం చిత్తు చేసిందని, ఎక్కడైనా వినిపించేది ఒక్కటే భారత్ మాతాకి జై అని అన్నారు. మీరు చరిత్ర సృష్టించారు..మీ దర్శనం కోసం నేను వచ్చానని అన్నారు.భారత్ మాతా కీ జై అనేది కేవలం నినాదం కాదని, దేశం కోసం తమ ప్రాణాలను అంకితం చేస్తామని మన సైనికులు చేసే ప్రతిజ్ఞ అని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. భారత్ మాతా కీ జై అనే నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని అన్నారు. భారత సైనికుల ధైర్య సాహసాల కారణంగా ఆపరేషన్ సిందూర్ విజయం ప్రతిధ్వనులు ప్రపంచవ్యాప్తంగా వినబడుతున్నాయని మోదీ చెప్పారు. భారత సైనికులు కొట్టిన దెబ్బకు శత్రు స్థావరాలు మట్టిలో కలిసిపోయాయని మోదీ వ్యాఖ్యానించారు. భారత క్షిపణులు, డ్రోన్లు పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించాయని, పాక్‌లో ఎక్కడ కూడా ప్రశాంతంగా శ్వాస తీసుకునే అవకాశం లేకుండా చేశామని మోదీ అన్నారు. పాక్ సైన్యానికి నిద్రలేని పరిస్థితి సృష్టించామన్నారు. భారత వైమానిక స్థావరాలపై దాడులు చేసేందుకు పాక్ నిరంతరం ప్రయత్నించిందని ఐతే సరిహద్దుల ఆవలే మన త్రివిధదళాలు ఆ దాడులను తిప్పికొట్టాయని తెలిపారు. పంజాబ్‌లోని జలంధర్ జిల్లాలో ఉన్న ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన ఆయన, సైనికులతో మాట్లాడారు.ఉగ్రదాడి జరిగితే నచ్చిన సమయంలో నచ్చినట్లు భారత్ ప్రతీకార దాడి చేస్తుందని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదులు, ఉగ్రవాదానికి మద్దతిచ్చే వారిని వేర్వేరుగా చూడమని అన్నారు. న్యూక్లియర్ బ్లాక్‌మెయిలింగ్‌కు భారత్ ఎట్టిపరిస్థితుల్లనూ తలొగ్గదని అన్నారు. త్రివిధదళాలు ఎవరి బాధ్యత వారు అద్భుతంగా నిర్వహించారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో మానవశక్తి, యంత్రశక్తి మధ్య అద్భుతమైన సమన్వయంతో పని చేసినట్లు చెప్పారు.ఉగ్రదాడి జరిగితే నచ్చిన సమయంలో నచ్చినట్లు భారత్ ప్రతీకార దాడి చేస్తుందని మోదీ స్పష్టం చేశారు.



## కల్తీ మద్యం కలకలం 14 మంది మృతి



- మరో 15 మంది పరిస్థితి విషమం..!

**టీ మీడియా, మే 13,అమృతసర్:**
పంజాబ్‌లోని అమృతసర్ జిల్లాలో తీవ్ర విషాదం వెలుగులోకి వచ్చింది. కల్తీ మద్యం తాగి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యక్తులందరినీ అమృత్‌సర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అమృత్‌సర్ జిల్లాలోని భుల్లార్, తంగ్రా, సంధా గ్రామాల్లో కల్తీ మద్యం సేవించడం వల్ల మరణాలు సంభవించాయి. మరణించిన వారిలో ఎక్కువ మంది గ్రామాల్లోని ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులే. ఈ సంఘటన తర్వాత చర్యలు తీసుకున్న పంజాబ్ పోలీసులు నకిలీ మద్యం సరఫరా చేసిన ప్రధాన నిందితుడితో సహా ఐదుగురిని అరెస్టు చేశారు.ఈ ఘటనపై సీఎం భగవంత్ మాన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అలాగే ఆయన దోషులను కఠినంగా శిక్షిస్తామని, ఈ ఘటనపై లోతైన విచారణ జరిపించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఉచిత వైద్య సహాయం అందిస్తుందని సీఎం ప్రకటించారు. కల్తీ మద్యం అమ్మకదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పంజాబ్ ప్రభుత్వం నుండి పోలీసులకు కఠిన ఆదేశాలు అందాయి. దీంతో తాజా ఘటనపై 2 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.కల్తీ మద్యం తాగడం వల్ల ప్రజల ఆరోగ్యం క్షీణించింది. నోటి మాట బంద్ అయ్యింది. స్థానిక ప్రజల ప్రకారం, మరారి కలాన్ గ్రామంలోనే నలుగురు మరణించారు. అమృత్‌సర్ గ్రామీణ ఎస్ఎస్‌పి ప్రకారం, ప్రధాన నిందితుడు ప్రభ్‌జీత్ సింగ్ నకిలీ మద్యం సరఫరా చేయడం వెనుక ప్రధాన సూత్రధారి అని, అతన్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. దీంతోపాటు, ప్రధాన నిందితుడి సోదరుడు కుల్బీర్ సింగ్ అలియాస్ జగ్గు, సాహిబ్ సింగ్ అలియాస్ సారాయ్, గుర్జంత్ సింగ్, జీత భార్య నిందర్ కౌర్‌లను కూడా అరెస్టు చేశారు. వారిపై ఎక్సైజ్ చట్టంలోని సెక్షన్ 105 బిఎన్ఎస్, 61ఎ కింద పోలీసులు కేసు నమోదు చేశారు.కల్తీ మద్యం సేవించి మరణించిన వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మరారి కలాన్ గ్రామంలోనే ఎక్కువ మరణాలు సంభవించాయి. చాలా మంది ఇప్పటికీ కొనఉపిరితో పోరాడుతున్నారు. ఈ సంఘటన తర్వాత, పంజాబ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నకిలీ మద్యం వ్యాపారంపై దర్యాప్తు చేయాలని ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఆదేశాలు జారీ చేశారు. మజిత కేసులో ఇప్పటివరకు 5 మంది నిందితులను అరెస్టు చేశారు.పంజాబ్‌లో కల్తీ మద్యం సేవించి మరణాలు సంభవించడం ఇది మొదటిసారి కాదు, అయితే కల్తీ మద్యం సేవించి ఎందరో ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది మార్చిలో సంగ్రూర్‌లో కల్తీ మద్యం సేవించి దాదాపు 21 మంది మరణించారు. చాలా మంది కంటి చూపును కోల్పోయారు. కాగా, 2020 సంవత్సరంలో తర్న్ తరన్‌లో కల్తీ మద్యం బారిన పడి 50 మందికి పైగా మరణించారు.

# కేసీఆర్ మాటే.. హరీష్ బాట

## కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తా


- మాజీ మంత్రి హరీష్‌రావు



**టీ మీడియా, మే 13,హైదరాబాద్ బ్యూరో :**
బీఆర్ఎస్‌లో ఎలాంటి విభేదాలు లేవు.. క్రమశిక్షణ కలిగిన కేసీఆర్ కార్యకర్తను నేను.. కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తా.. కేసీఆర్ ఆదేశాలను పాటిస్తా.. కేసీఆర్ నిర్ణయాన్ని శిరసావహిస్తా, గీత దాటేది లేదు.. అంటూ మాజీ మంత్రి హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గత కొన్ని రోజులుగా హరీష్ రావు బీఆర్ఎస్ పార్టీలో ఇబ్బందులు పడుతున్నారంటూ సోషల్ మీడియాలో కొనసాగుతున్న ప్రచారంపై మాజీమంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ లో ఎలాంటి విబేధాలు లేవన్నారు. కేసీఆర్ మాటే.. హరీష్ బాట.. గీత దాటేది లేదంటూ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారం, వార్తలపై తాను అదే రోజు ఖండించానని హరీష్ రావు పేర్కొన్నారు. "కొన్ని వందలసార్లు చెప్పాను కేసీఆర్ మా పార్టీ అధ్యక్షులు.. వారి ఆదేశాలను తూచా తప్పకుండా పాటించే క్రమశిక్షణ కలిగిన కార్యకర్త హరీష్ రావు అని.. పార్టీ నిర్ణయాన్ని, కేసీఆర్ నిర్ణయాన్ని శిరసావహిస్తాను తప్ప పార్టీ నిర్ణయాన్ని జవదాటను.. మై లీడర్ ఈజ్ కేసీఆర్. వాట్ ఎవర్ కేసీఆర్ సే హరీష్ రావు విల్ ఫాలో".. అంటూ హరీష్ రావు మంగళవారం మీడియాతో చెప్పారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులపై ప్రభుత్వానికి ప్రేమ లేదన్నారగ.. ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా చేస్తున్నారు.. రైతులు చనిపోతుంటే రివ్యూ చేసే సమయం లేదా..? అని ప్రశ్నించారు. అందాల పోటీలను మాత్రం సీఎం ఎంజాయ్ చేస్తున్నారు.. రైతుల కోసం క్షేత్రస్థాయిలో అధికారులను పంపాలి.. స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. పాక్‌ను నమ్మి అప్పు ఇస్తున్నారు కానీ.. రేవంత్‌కు మాత్రం అప్పు ఇవ్వడం లేదంటూ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందాల పోటీల్లో బిజీగా ఉన్నారు.. అందాల పోటీల మీద రివ్యూల మీద రివ్యూలు చేస్తున్నారు.. వేలాదిమంది పోలీస్ లను, ప్రభుత్వాధికారులను నియమించి అందాల పోటీలను నిర్వహిస్తున్నారు. కానీ దేశానికి అన్నం పెట్టే రైతు కోసం, ఆరుగాలం కష్టపడే రైతు కష్టం తీర్చడానికి ఈ ముఖ్యమంత్రికి సమయం లేకపోవడం చాలా దురదృష్టకరమంటూ హరీష్ రావు పేర్కొన్నారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో రైతులను అరిగోస పెడుతోంది. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నదన్నారు. ఈ యాసంగికి 70 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం కొంటామని ప్రభుత్వం చెప్పింది కానీ 40 లక్షల మెట్రిక్ టన్నులు కూడా దాటలేదన్నారు. కొన్న వడ్లకు 4 వేల కోట్లు బకాయి పడిందన్నారు. 48 గంటల్లో కొన్న ధాన్యానికి రైతుల ఖాతాలో డబ్బులు వేస్తామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ప్రగల్బాలు పలికారు. పది రోజులైనా కొన్న పంటకు డబ్బులు దిక్కులేదన్నారు. బోనస్ ఊసే లేదు. యాసంగి పంటకు 512 కోట్ల రూపాయలు సన్నాలకు బోనస్ చెల్లించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ఐదు పైసలు కూడా విడుదల చేయలేదంటూ మండిపడ్డారు. ఎన్నికల ముందు కేసీఆర్ 10,000 ఇస్తున్నారు.. మేం 15,000 ఇస్తాం.. అన్నారని.. చివరకు ఏం లేకుండా చేశారన్నారు. చాలా మంది రైతులు చనపోయారని.. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అయినా అమలు చేశారా..? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తుందని తెలిపారు.

# ప్రార్థన మందిరాల కూల్చివేతను నిలిపివేయండి

- సీఎం చంద్రబాబు సంచలన ఆదేశాలు





**టీ మీడియా ,మే 13,ఢిల్లీ :**
లోని ఏపీ భవన్ స్థలంలో ప్రార్థన మందిరాల కూల్చివేతను నిలిపివేయాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఢిల్లీ ఏపీ భవన్‌లో ఆక్రమణల తొలగింపు, ప్రార్థనా మందిరం తొలగింపు ప్రతిపాదన అంశంపై అధికారులతో చర్చించిన సీఎం చంద్రబాబు.. ఆయా మతాలకు చెందిన వారి అభిప్రాయలకు విరుద్ధంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించారు. ప్రార్థన మందిరాల పట్ల సంయమనం పాటించాలన్న చంద్రబాబు.. ప్రజల మనోభావాలు దెబ్బతినే చర్యలుతీసుకోవద్దని సూచించారు. అయితే.. సీఎం చంద్రబాబు నాయుడు సూచనతో ఆక్రమణల తొలగింపు ఆగిపోయింది.రాష్ట్ర విభజనలో భాగంగా ఏపీ భవన్ స్థలాన్ని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు పంచుకున్నాయి. ఈ ప్రాంతంలో కొత్త భవనం నిర్మించేందుకు అవసరమైన చర్యలను ఏపీ యంత్రాంగం చేపట్టింది. ఏపీ భవన్ ప్రాంగణంలో 0.37 ఎకరాల్లో పలు ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు తేల్చారు. అక్రమాల తొలగింపునకు గత నెల నుంచి తీసుకున్న చర్యలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు అదే ప్రాంతంలో ఉన్న రెండు ప్రార్థనా మందిరాలను కూడా తొలగించాల్సి ఉందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రజల, మత సంస్థల మనోభావాలు దెబ్బతినే చర్యలు తీసుకోవద్దని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారుఅక్కడ స్థానికులు ఏర్పాటు చేసుకున్న దేవాలయం తొలగింపు విషయంలో అభ్యంతరాలపై అధికారులను సీఎం చంద్రబాబు వివరణ కోరారు. ప్రార్థనా మందిరాల తొలగింపు విషయంలో సంయమనం పాటించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ముఖ్యమంత్రి సూచనలతో సోమవారమే నిర్మాణాల తొలగింపు ప్రక్రియను నిలిపివేశామని అధికారులు చెప్పారు.

# గంటలకు రూ.210లు

## విజయవాడలో పార్కింగ్ దందా

- బెదిరించి మరీ డబ్బులు వసూలు



మిగతా 3లో..



# పుర వీధుల్లో వీధికుక్కల స్వైర విహారం

- మనుషులపై దాడులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని పుర వీధుల్లో విధి కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి, మనుషులపై మూగజీవులపై అనేక దాడులు, ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోని వనపర్తి మున్సిపల్ అధికారులు, ప్రమాదాలు జరిగినప్పుడుబాధితులను తూతూ మంత్రంగా పరామర్శించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అనుచరులు. ఇది చేస్తాం అది చేస్తామని ఫోటోలకు ఫోజులిచ్చి కొన్ని రోజుల తర్వాత బాధితులు ఫోన్ చేస్తే ఎత్తకపోవడం గమనార్హం.



అందోళనలో వీధి కుక్కల బాధితులు. కుక్కలు ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. వనపర్తి మున్సిపాలిటి లోని కాలనీలలో కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు,సైకిల్,ద్విచక్రవాహనదారులను వెంబడించి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేతెత్తుతున్నారు. రాత్రి సమయాలలో సైతం రోడ్లపైకి వచ్చి నడుచుకుంటూ వేళ్లే వారిపై వీధి కుక్కలు దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటిలో గతంలో చిన్నారులు కుక్కల భారీన పడి గాయాల పాలైన మున్సిపల్ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడే స్పందించే అధికారులు తరువాత ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మున్సిపాలిటిలో వీధి కుక్కల నిర్మూలనకు అధికారుల చర్యలు నామమాత్రంగా ఉన్నాయి. నిత్యం ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందిన మున్సిపల్ అధికారులు మాత్రం వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎప్పుడో ఒక్కసారి వీధి కుక్కలను పట్టుకోని పోయి అనంతరం చేతులు దులుపుకోవడం మున్సిపల్ అధికారుల వంతుగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీధి కుక్కల స్వైర విహారంపై స్పందించి నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరతున్నారు.కొద్ది రోజుల క్రితం హరిజనవాడ లో గొర్రెల మంద పై కుక్కలు దాడి చేసి కొన్నిటిని చంపగా, మరికొన్నిటిని గాయపరిచాయి. అతనికి మూడు లక్షల దాకా నష్టం వాటిల్లింది. వాటిని పరామర్శించిన ఎమ్మెల్యే అనుచరులు, ఎమ్మెల్యే ఇప్పటికే అతనికి ఎలాంటి సహాయం అందించలేదు.

**కుక్కల వల్ల సోకే వ్యాధులు**

వీధి కుక్కల స్వైర విహారం వల్ల ప్రజలకు కొన్ని వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కుక్కకాటు ద్వారా రాబిస్ ఇతర వైరల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ సోకే అవకాశం ఉంది. అంతేకాకుండా, పరాన్నజీవులు, లైమ్ వ్యాధి, రాకీ మౌంటెన్ మచ్చల జ్వరం మొదలైన వ్యాధులు కూడా సోకే ప్రమాదం ఉంది. రాబిస్ అనేది ఒక వైరల్ వ్యాధి, ఇది జంతువుల ద్వారా మానవులకు సోకుతుంది. కుక్కకాటు ద్వారా రాబిస్ సోకితే, అది ప్రాణాంతకం కావచ్చు.వీధి కుక్కలు కలుషితమైన ప్రాంతాలలో సంచరిస్తూ, వాటి ద్వారా బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్స్ సోకే ప్రమాదం ఉంది.వీధి కుక్కలకు టిక్ వంటి పరాన్నజీవులు సోకి ఉంటాయి. ఈ పరాన్నజీవులు కుక్కకాటు ద్వారా మానవులకు సోకి, లైమ్ వ్యాధి, రాకీ మౌంటెన్ మచ్చల జ్వరం మొదలైన వ్యాధులకు కారణం కావచ్చు.వీధి కుక్కలు కాటు వేయడం వల్ల గాయాలు, ఇన్ఫెక్షన్లు, రాబిస్ ఇతర వ్యాధులు సోకే అవకాశం ఉంది. వీధి కుక్కలకు దూరంగా ఉండటం మంచిది.కుక్కకాటుకు గురైనట్లయితే, వెంటనే వైద్యుడిని సంప్రదించండి.రాబిస్ వ్యాధిని నివారించడానికి, టీకాలు వేయించుకోవడం అవసరం.పెంపుడు కుక్కలను కలిగి ఉంటే, వాటిని వ్యాధి రహితంగా చూసుకోవాలి.



---



## నివాళులర్పించిన ఎంఐఎం

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**
పెబ్బేరు పట్టణ 12 వ వార్డు కి చెందిన రఘువర్ధన్ రెడ్డి అనారోగ్యంతో మరణించారు. ఇట్టి విషయాన్ని 12 వ వార్డు ఇంచార్జ్ జాకీర్ తెలపగా పెబ్బేరు ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు ఎం.డి ఆఫ్రోజ్, ఉప అధ్యక్షుడు జాకీర్ వారి స్వగృహానికి వెళ్లి భౌతిక కాయానికి పులా మాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది.

**అసదుద్దీన్ ఓవైసీ జన్మదినం**

ఎంఐఎం పార్టీ జాతీయ అధ్యక్షుడు హైదరాబాద్ ఎంపీ బారిస్టర్ అసదుద్దీన్ ఓవైసీ జన్మదిన సందర్భంగా పెబ్బేరు మండల ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు ఎం.డి ఆఫ్రోజ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఫుడ్ ప్యాకెట్లు, నీళ్ల బాటిల్ అందజేశారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల ఎంఐఎం పార్టీ ఉప అధ్యక్షుడు జాకీర్, జనరల్ సెక్రెటరీ అమెర్, తదితరులు ఎంఐఎం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## కోలన్ హన్మంత్ రెడ్డి చొరవతో పనులు

**టీ మీడియా, మే 13, మేడ్చల్:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో బస్తి వాసులు తీవ్ర ఇబ్బంది గురవడంతో బస్తి వాసులు గత నెల కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకు రాగ సదురు కమీషనర్ తో మాట్లాడి స్పెషల్ ఫండ్స్ ద్వారా మంజూరు చేయించి ఈరోజు డ్రైనేజీ పనులను ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు అనంతరం బస్తి వాసులు హర్షం వ్యక్తం చేస్తూ హన్మంతన్నకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎం సి జనరల్ సెక్రటరీ కోలన్ జీవన్ రెడ్డి, డివిజన్ టి సాయి రాజ్, శ్రీనివాస్ గౌడ్, మేడ్చల్-మల్కాజ్గిరి యూత్ కాంగ్రెస్ సెక్రటరీ ఏరోళ్ల విష్ణు, శ్రీశైలం, వీరేష్, గంగాధర్, ఎండి ఫరీద్, ఎండి అలీ, ఎండి ముజుబ్, కాబ్రల్, లక్ష్మి నారాయణ, రామ, నవ్య, చిన్న సాయిలు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమమే ధ్యేయం

- బిఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**టీ మీడియా, మే 13, మేడ్చల్:**
కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు, వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మీ ఇంట్లో సభ్యుడిగా మీ ఆశీర్వాదంతో మూడవ సారి ఎమ్మెల్యేగా నన్ను గెలిపించిన కుత్బుల్లాపూర్ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని,సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులుగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు.

## వడదెబ్బతో రైతు మృతి

**టీ మీడియా మే 13:వెల్గటూర్**
మండలం, జగదేవ్ పేట గ్రామానికి చెందిన బచ్చుల నర్సయ్య తండ్రి ఎర్ర పోచయ్య వయస్సు 46 అనే వ్యక్తి మండుటెండలో రెండు రోజులు నుండి వ్యవసాయ పనులకు వెళ్లడంతొ వడదెబ్బ తగిలి అస్వస్థకు గురి అవ్వగా కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించగా చికిత్స అందిస్తున్న క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి వరంగల్ లోని ఎంజిఎమ్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయంమృతుచెందాడు మృతునికి భార్య ఇద్దరు కూతుర్లు వున్నారు. మృతుడు గ్రామంలోని ప్రతిఒక్కరితొసన్నిహితంగా వుండె వాడని గ్రామస్తులు కన్నీరు మున్నీరు అయ్యారు.తన మరణంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.





## జమ్ముకశ్మీర్‌లో భారీ భారీ ఎన్‌కౌంటర్

- ముగ్గురు లష్కరే టెర్రరిస్టుల హతం

**టీ మీడియా, మే 13,షోపియన్ :**
భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పుడిప్పుడే చల్లబడుతున్నాయి. అయితే తాజాగా జమ్మూ కాశ్మీర్‌లోని షోపియన్ నుండి షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. మంగళవారం(మే 13) తెల్లవారుజామున ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు మొత్తం ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ఇక్కడ భారీ కాల్పులు జరుగుతున్నాయి. అందుతున్న సమాచారం ప్రకారం, భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఇప్పటి వరకు ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు.జమ్మూ కాశ్మీర్‌లోని షోపియన్ జిల్లాలోని జిన్‌పథర్ కెల్లర్ ప్రాంతంలో మంగళవారం ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య పెద్ద ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు హతమైనట్లు భద్రతా వర్గాలు తెలిపాయి. అదే ప్రాంతంలో మరికొందరు లష్కర్ ఉగ్రవాదులు దాగి ఉన్నారని భద్రతా దళాలు అనుమానిస్తున్నాయి. వారిని పట్టుకోవడానికి ఆపరేషన్ జరుగుతోంది.ఇటీవల భద్రతా సంస్థలు ముగ్గురు పాకిస్తానీ ఉగ్రవాదులు ఆదిల్ హుస్సేన్ థోకర్, అలీ భాయ్, హాషీమ్ మూసా పోస్టర్లను విడుదల చేసిన సమయంలో ఈ సంఘటన జరిగింది. 'టెర్రర్ ఫ్రీ కాశ్మీర్' ప్రచారం కింద ఈ ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో ఈ ముగ్గురు ముఖ్యమైన పాత్ర పోషించారని భద్రతా దళాలు భావిస్తున్నాయి.జిన్‌పథర్ కెల్లర్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లు భద్రతా దళాలకు నిఘా సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. సోదాల సమయంలో, దాగి ఉన్న ఉగ్రవాదులు భద్రతా దళాలపై కాల్పులు జరిపారు. ఆ తర్వాత రెండు వైపుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది.ఈ ఎన్‌కౌంటర్‌లో భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరిపి ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చినట్లు తెలుస్తోంది. మరణించిన ఉగ్రవాదుల గుర్తింపు ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు. కానీ మూలాల ప్రకారం వారంతా లష్కరే తోయిబా సభ్యులుగా భావిస్తున్నారు. మిగిలిన ఉగ్రవాదులను పట్టుకోవడానికి భద్రతా దళాలు ఇప్పటికీ ఆ ప్రాంతంలో జాగ్రత్తగా సోదాలు నిర్వహిస్తున్నాయి.ఉగ్రవాదంపై జరుగుతున్న పోరాటంలో భద్రతా దళాలకు ఈ సంఘటన గొప్ప విజయాన్ని అందించింది. పహల్గామ్ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను ఏరివేయడానికి భద్రతా సంస్థలు నిరంతరం ప్రయత్నిస్తున్నాయి. ఈ ఎన్‌కౌంటర్ ఆ దిశలో ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణిస్తున్నారు. ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదనపు బలగాలను మోహరించారు.



## అమ్మ దయ ఉంటే అన్నీ సమకూరుతాయి

- బిఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**టీ మీడియా, మే 13, మేడ్చల్:**
జగద్గిరిగుట్ట 126 డివిజన్ భూదేవి హిల్స్ నందు నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన %డ% నాభీశిలా (బొడ్రాయి) ప్రతిష్ట మహోత్సవానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి దయ ఉంటే అన్ని సమకూరుతాయని, అమ్మవారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలన్నారు. అనంతరం భూదేవి హిల్స్ లో నిర్వహించిన నాభీశిలా (బొడ్రాయి) ప్రతిష్టాపనలో బొడ్రాయికి కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు బాబు గౌడ్, విఠల్, శశిధర్, జైహింద్, తిరుమల్ రెడ్డి, మల్లా చారి, తిరుపతి, దినేష్, సత్యనారాయణ, మెట్ల శ్రీను, ఎర్ర లక్ష్మయ్య, బ్రహ్మానంద చారి, మహంకాళి, వెంకటేష్, అజం, ప్రభాకర్, ఆంజనేయులు, నాగరాజు, ముంతాజ్, నవీన్, రాజు, సురేష్, మధు, సోమయ్య, తారా సింగ్, మహిళా నాయకురాలు త్రివేణి, మంజుల, పార్వతీ, పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు బాలకృష్ణ, భూదేవి హిల్స్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న విప్ లక్ష్మణ్ కుమార్,ఎమ్మెల్యే విజయరమణరావు

**టీ మీడియా మే 13:ధర్మారం:**
ఖిలవనపర్తి గ్రామంలోని లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణరావు.వీరికి ఆలయ కమిటి చైర్మెన్, కమిటి సభ్యులు ఆలయ అర్చకులు ఎమ్మెల్యే లకు ఘనంగా స్వాగతం పలికి శాలువాలు కప్పి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలుఅందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మెన్, కమిటి సభ్యులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## మారుమూల గ్రామాలకు బస్సులు వేయాలి

- ఐక్యవేదిక డిమాండ్

**టీ మీడియా, మే 13, వనపర్తి బ్యూరో :**
మారుమూల గ్రామాలకు, పుణ్యక్షేత్రాలు, దూర ప్రాంతాలకు బస్సులు వేయాలి. అందుకు అనుగుణంగా చరిత్ర కలిగిన వనపర్తి బస్ డిపోలో బస్సుల సంఖ్య పెంచండి. అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేశారు. మంగళవారం బస్సు డిపో సందర్శించిన అఖిలపక్ష ఐక్యవేదిక, డిపో మేనేజర్ కి వినతిపత్రం ఇస్తూ ,అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ దూర ప్రాంతాలకు, మారుమూల ప్రాంతాలకు పుణ్యక్షేత్రాలైన యాదగిరిగుట్ట, మంత్రాలయం, శ్రీశైలం, తిరుపతి లకు వెంటనే బస్సులు వేయాలని, మాజీ ఎమ్మెల్యేల గ్రామాలకు జయరాములు వారి గ్రామం గుమ్మడం కు, బాలకృష్ణయ్య గ్రామం చిట్యాల పెద్దమందడి మీదుగా మహబూబ్నగర్, హైదరాబాద్ బస్సులు నడుపాలని, పాత బస్టాండు నిర్మాణం చేయించి, మారుమూల గ్రామాలకు బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. స్క్రాప్ బస్సులో స్థానంలో 20 బస్సులు వచ్చాయని అవి సరిపోక మరో 25 బస్సులు డిపోకు అవసరమని వెంటనే తెప్పించాలని ఎమ్మెల్యే మేగారెడ్డి, కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సతీష్ యాదవ్, వెంకటేశ్వర్లు, కొత్త గొల్ల శంకర్ గౌనికాడి యాదయ్య, రాజ్ కుమార్, మన్యం నాయక్, రాము యాదవ్, శివకుమార్, పుట్టపాక బాలు తదితరులు పాల్గొన్నారు.



## రిటైర్మెంట్ తర్వాత ఎలాంటి పదవులు తీసుకోను

- పదవీ విరమణ చేసిన ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా

**టీ మీడియా, మే 13,ఢిల్లీ బ్యూరో :**
సీజేఐగా పదవీ విరమణ అనంతరం ఎలాంటి అధికారిక పదవులను స్వీకరించబోనని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. కానీ, న్యాయ వృత్తిలో కొనసాగుతానని స్పష్టం చేశారు. మంగళవారం పదవీ విరమణ బెంచ్? కార్యక్రమాలు ముగిసిన అనంతరం కోర్టు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. 2019 జనవరి 18న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియామకమైన ఆయన, 2024 నవంబర్? 11న చీఫ్? జస్టిస్?గా నియమితులయ్యారు. సుమారు ఆరు నెలల పాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించి మంగళవారం పదవీ విరమణ చేశారు.దిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్? యశ్వంత్ వర్మ ఇంట్లో నగదు దొరికిన ఘటనపైనా జస్టిస్ ఖన్నా స్పందించారు. సరైన తీర్పు కోసం ప్రతీ కేసులోని ప్లస్, మైనస్ పాయింట్లతో పాటు అనేక కోణాల్లో హేతుబద్ధంగా పరిశీలిస్తామని తెలిపారు. యశ్వంత్ వర్మ వ్యవహారంలో సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తుకు ఆదేశించడంతో పాటు దిల్లీ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు.

అంతర్గత దర్యాప్తు నివేదిక అనంతరం వర్మను రాజీనామా చేయాలంటూ ఆదేశించారు. అందుకు వర్మ అంగీకరించకపోవడంతో ఈ విషయంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారదిల్లీలోని ప్రముఖ కుటుంబానికి చెందిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, దివంగత మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నాకు సమీప బంధువు. 1960 మే 14న జన్మించిన సంజీవ్ ఖన్నా దిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్యను చదివారు. 2005లో దిల్లీ హైకోర్టు అదనపు జడ్జీగా నియమితులై, ఆ మరుసటి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా ఉన్నతి పొందారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి సాధించిన ఆయన, 2024 నవంబర్ 11న దేశ సర్వోన్నత న్యాయస్థానం 51వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు.మరోవైపు తదుపరి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్? బీఆర్ గవాయ్? బాధ్యతలు చేపట్టనున్నారు. బుధవారం ఆయన 52వ సీజేఐగా ప్రమాణం చేయనున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల మీడియాతో మాట్లాడిన ఆయన, సీజేఐగా పదవీ విరమణ అనంతరం ఎలాంటి కొలువునూ చేపట్టబోనని చెప్పారు. తనకు ఎలాంటి రాజకీయ ఆకాంక్షలు లేవని స్పష్టం చేశారు.

# గంటలకు రూ.210లు

- విజయవాడలో పార్కింగ్ దందా
- బెదిరించి మరీ డబ్బులు వసూలు




**టీ మీడియా, మే 13,విజయవాడ :**
'మేం చెప్పినంత కట్టాకే నీ వాహనం ఇక్కడి నుంచి కదులుతుంది. నీకు దిక్కున్నచోట చెప్పుకో. కారు పార్కింగ్? ఫీజు గంటకు రూ.30 చొప్పున ఎంతసేపు ఉంటే అంత కట్టాల్సిందే. ఏడాదికి రూ.కోటి కట్టి పార్కింగ్ కాంట్రాక్టు తీసుకున్నాం. నెలకు రూ.10లక్షలు నగరపాలక సంస్థకు కట్టాలి. ఆ డబ్బులు నువ్వొచ్చి ఇస్తావా? మర్యాదగా డబ్బులు కట్టి ఇక్కడి నుంచి వెళ్లిపో. నీ కారు 6 గంటల 20 నిమిషాలు పార్కింగ్‌లో ఉంచావ్. అంటే ఏడు గంటల కిందే లెక్క. డబ్బులు కడితేనే ఇక్కడి నుంచి కదులుతావు'. విజయవాడలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్ వద్ద పార్కింగ్‌లో పటమటకు చెందిన రమణమూర్తి అనే వాహనదారుడికి తాజాగా ఎదురైన అనుభవం ఇది. బెదిరించి మరీ 7 గంటలకు రూ.210 పార్కింగ్ ఫీజు బలవంతంగా వసూలు చేశారు.విజయవాడలోని ప్రైవేట్ మాల్స్, మల్టీప్లెక్స్‌లలో సైతం ఇంత భారీగా దోపిడీ జరగడం లేదు. కానీ నగరంలోని ప్రభుత్వ రంగ పార్కులు, దుకాణ సముదాయాల వద్ద వీటి పరిస్థితి అత్యంత దారుణంగా ఉంటోంది. ప్రజల జేబులకు భారీగా చిల్లు పెడుతున్నా కనీసం అధికారులు పట్టించుకోవడం లేదు. ఏటా గుత్తేదారు చెల్లించే డబ్బులు, కింది స్థాయి సిబ్బందికి ఇచ్చే మామూళ్లే తప్ప ప్రజల దగ్గర అన్యాయంగా దోచేస్తున్నారు అని కనీస పర్యవేక్షణ కూడా నగరపాలక సంస్థ అధికారుల్లో లేదు. 'డబ్బులు కడతావా దెబ్బలు తింటావా' అని బెదిరించి మరీ దందా నిర్వాహకులు సాగిస్తున్నారు.

### రశీదుల్లోనూ మోసమే

రైల్వేస్టేషన్ లాంటి ప్రీమియం పార్కింగ్ నిర్వహించే చోట కార్లకు 3 గంటలకు రూ.30, ఆ తర్వాత ప్రతి గంటకు రూ.10 కట్టించుకుంటారు. కానీ ఎన్టీఆర్ కాంప్లెక్స్ వద్ద వాహనదారులకు ఇచ్చే రశీదుల్లో ఎన్ని గంటలకు ఎంత చెల్లించాలనేది ఉండదు. పసుపు రంగులో ఉండే చిన్న రశీదు చేతిలో పెడతారు. దానిలో కారుకు రూ.30, బైక్‌కు రూ.10 అని ఉంటుంది. కానీ గంటలు అన్న దగ్గర చిన్న గీత పెట్టి ఖాళీగా ఉంటుంది.

వాహనదారులు తిరిగొచ్చాక గంటకు రూ.30, రూ.10 చొప్పున కట్టించుకుంటున్నారు. ఇక్కడ ఏకంగా ఆరు గంటలుంచితే రూ.210 కట్టిస్తున్నారంటే నచ్చినంత దోచుకో అని అధికారులే లైసెన్స్ ఇచ్చేశారా? అనే అనుమానం కలుగుతోంది.చర్యలు తీసుకోకుండానే పరిష్కారం: బాధితుడు రమణమూర్తి ఈ అన్యాయంపై అధికారులకు ఫిర్యాదు చేయడానికే అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పురమిత్రలో ఫిర్యాదు చేస్తే సచివాలయ కార్యదర్శి ఫోన్ చేసి ఇది మా పరిధిలో లేదని చెప్పారు. ఆర్టీఐలో దరఖాస్తు చేస్తానంటే దిగొచ్చి ఫిర్యాదు తీసుకున్నారు. 4 రోజుల తర్వాత సమస్య పరిష్కరించేశామంటూ ఎండార్సుమెంట్‌ను ఫిర్యాదుదారుకు పంపించారు. దానిలో స్పష్టంగా 3 గంటలకు రూ.30 వసూలు చేయాలి, దాటితే గంటకు రూ.10 తీసుకోవాలి, ఎవరైనా అధికంగా వసూలు చేస్తే లీజు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామంటూ ఎస్టేట్ అధికారి లత పేరుతో ఎండార్స్‌మెంట్ పంపించారు. కానీ 6 గంటలకు రూ.210 దోచుకున్న గుత్తేదారుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో మాత్రం చెప్పలేదు.

# వాతావరణ శాఖ చల్లని కబురు

- అండమాన్‌ను తాకిన నైరుతి రుతుపవనాలు

**టీ మీడియా ,మే 13,ఢిల్లీ :**



గత కొన్ని రోజులుగా భానుడి ప్రతాపంతో అల్లాడుతున్న దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని కబురు చెప్పింది. ఊహించిన దాని కంటే వేగంగా నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినట్లు తెలిపింది. మంగళవారం మధ్యాహ్నం నాటికి ఈ నైరుతి రుతుపవనాలు దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలను తాకినట్లు ఐఎండీ వెల్లడించింది. నైరుతి రుతుపవనాల రాక కారణంగా గత 2 రోజులుగా అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని పేర్కొంది.అయితే రానున్న మూడు నాలుగు రోజుల్లో ఈ నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులతో పాటు దక్షిణ అరేబియా సముద్రం, బంగాళాఖాతం మధ్య వరకు విస్తరించనున్నట్లు ఐఎండీ తెలిపింది. అందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వెల్లడించింది. ఇక మే 27 నాటికి ఈ రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉన్నట్లు ఇప్పటికే వాతావరణ శాఖ అంచనా వేసిందసాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు భారత దేశంలో ప్రవేశిస్తాయి. ఈ సారి మాత్రం అంతకంటే ముందుగానే కేరళను తాకే అవకాశాలు కన్పిస్తున్నాయని ఇటీవల ఐటఎండీ పేర్కొంది. అలా జరిగితే 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం ఇదే మొదటిసారి అవుతుంది. ఆ ఏడాది మే 23నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి. మరోవైపు ఈ సారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.ఇప్పటికే మన దేశంలో సాగుభూమిలో 52శాతం వర్షంపైనే ఆధాపడి రైతులు పంటలు పండిస్తారు. మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40% దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో ఈ నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. దేశవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి ముఖ్యమైన జలాశయాలను తిరిగి నింపడానికి ఈ రుతుపవనాలే ఆధారం. అంతేకాకుండా దేశ జీడీపీ తోడ్పాటుకు ఇది ఎంతో కీలకంగా ఉంది.




## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

**టీ మీడియా, మే 13, మేడ్చల్:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, సంఘ సభ్యులు మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గారిని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో జరగబోయే శుభకార్యక్రమాల వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు.



## హన్మంత్ రెడ్డిని కలిసిన 132 డివిజన్ ప్రాగటూల్స్

**టీ మీడియా, మే 13, మేడ్చల్:**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 132 డివిజన్ జీడిమెట్ల పరిధిలోని ప్రాగటూల్స్ వారు 32సం။ం గా అక్కడ 119 ఇండ్లకు పైగా నిర్మించుకున్నారు ప్రస్తుతం అక్కడ బల్క్ వాటర్ కనెక్షన్ ప్రస్తుత నివాసితులకు ఇబ్బంది పడుతుందని వేరు వేరు కనెక్షన్ కొరకు స్థానిక నివాసితుల ఇబ్బందులను మంగళవారం రోజు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేసి విన్నవించగా వెంటనే సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి గౌ ౹౹ శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి అతి త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రావణ్ కుమార్, ప్రసాదా రావు , రామ్ బాబు, వి . సుదర్శన్ రెడ్డి, బల్ రెడ్డి, ఎల్ . సుదర్శన్ గౌడ్, పరమేశ్వర్ రావు, గంగాధర్ మరియు తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తని పరామర్శించిన ఎమ్మెల్యే

**టీ మీడియా మే 13,ధర్మారం:**
ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కాక కుటుంబ అభిమాని. మండలంలోని గోపాల్రావుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త,పొన్నవేని స్వామి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డడని విషయం తెలియగానే వెంటనే స్పందించి వచ్చిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. గాయపడ్డ వ్యక్తి ఇంటికి వెళ్ళి స్వామిని పరామర్శించి ఆరోగ్యం గురించితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాడే సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశం గౌడ్, దేవి కిషోర్,ఎండీ అఫు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండల సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక

**టీ మీడియా ,మే 13,మల్హర్ రావు:**



మహిళ స్వయం సహాయక సంఘాలకు నూతన మండల సమాఖ్య సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. జిల్లా ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని కొయ్యుర్ శ్రీలక్ష్మీ సమాఖ్య సంఘం కార్యాలయంలో జిల్లా నుంచి హాజరైన (సిఆర్పిలు) ఎన్నికల సంఘం అధికారులుగా వ్యవహరించి, మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న 27 స్వయం సహాయక సంఘాల్లో నుంచి ముగ్గురు చొప్పున తీసుకొని ఆసక్తి ఉన్న మహిళలకు సమావేశం నిర్వహించి, ఏకగ్రీవంగా చీటీలు రాసి ఎన్నికకు మద్దతు తెలిపారు. మండల సమాఖ్య అధ్యక్షురాలుగా పెద్దతూండ్ల గ్రామానికి చెందిన మూల శారద, ప్రధాన కార్యదర్శిగా ఆన్ సాన్ పల్లి గ్రామానికి చెందిన లౌడ్య సునీత, కోశాధికారిగా కొండంపేట గ్రామానికి చెందిన అబ్బనవేన లావణ్య లు ఎన్నికయ్యారు. ఈ కమిటీ పదవికాలం మూడు సంవత్సరాలు కొనసాగునట్లుగా అధికారులు తెలిపారు.

# తిరుపతిలో కుంగిన గరుడ వారధి

- నాణ్యతపై అనుమానాలు
- రూ.684 కోట్ల వ్యయం



**టీ మీడియా, మే 13,తిరుపతి :**
తిరుపతిలోని గరుడ వారధి నాణ్యత, భద్రతపై అనుమానాలు మొదలయ్యాయి. నగరపాలక సంస్థ, టీటీడీ సంయుక్తంగా రూ.684 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించారు. 2023 సెప్టెంబరులో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ వంతెనను ప్రారంభించారు. ప్రస్తుతం తిరుమల బైపాస్ రోడ్డులోని ప్రకాశం పార్కు సమీపంలో గరుడ వారధి కుంగడంతో ఆఫ్కాన్స్ సంస్థ యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించింది.రెండు భాగాలనూ కలిపే జాయింట్ వద్ద ఇనుప చువ్వలు విరిగినట్లు సిబ్బంది గుర్తించారు. వాహనాలు ప్రయాణించినప్పుడు ఆ ప్రాంతంలో దారి కుంగి, అదురుతుండటంతో సమస్య వెలుగులోకి వచ్చింది. వంతెన మరమ్మతుల కోసం బారికేడ్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. గరుడ వారధి మరమ్మతులు ప్రారంభించామని, ఆందోళన అవసరం లేదని అధికారులు తెలిపారు.శ్రీవారిని దర్శించుకొనే భక్తులకు నగరంలో ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా నేరుగా తిరుమల చేరేలా 2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిపాదించిన గరుడ వారధిని వైఎస్సార్సీపీ అస్తవ్యస్తం చేసిందని శాప్ ఛైర్మన్ ఎ. రవినాయుడు, టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ తదితరులు ఆరోపించారు. వంతెనకు సంబంధించిన ఆకృతులు మార్చేయడంతో వైఎస్సార్సీపీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు లబ్ధి పొందారని ఆరోపించారు. వారధి మరమ్మతు పనులను సోమవారం వారు పరిశీలించారు.శ్రీనివాస సేతు టు గరుడ వారధి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరుపతిలోని వారధి పేరును గరుడ వారధిగా మార్పు చేశారు. తిరుపతి నగరపాలక సంస్థ, టీటీడీ సంయుక్తంగా నిర్మించిన స్మార్ట్ ఎలివేటెడ్ కారిడార్‌కు పనుల ప్రారంభోత్సవ సమయంలో 2019లో నిర్ణయించిన గరుడ వారధి పేరును గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం శ్రీనివాససేతుగా మార్చేసింది. అయితే వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారికంగా శ్రీనివాస సేతు అని నామకరణం చేసినప్పటికీ స్థానికులు మాత్రం ఈ వంతెనను గరుడ వారధిగానే పిలుస్తుంటారు. 'గరుడ వారధి' అనేది ప్రజల నోళ్లలో నానుతున్న పేరు కావడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత, వంతెనపై శ్రీనివాస సేతు అక్షరాలున్న ప్రాంతాల్లో గరుడ వారధిగా మార్చారు.

## శ్రీవారి భక్తులకు అలర్ట్


- వీఐపీ సిఫార్సు లేఖల స్వీకరణ
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**టీ మీడియా ,మే 13,తిరుమల :**
తిరుమలలో గురువారం నుంచి వీఐపీ సిఫార్సు లేఖలు స్వీకరిస్తామని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. తెలుగురాష్ట్రాల ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై బ్రేక్ దర్శనాలు ఉంటాయని వెల్లడించారు. ఇటీవల టీటీడీ తీసుకున్న గడువును తగ్గించి మే 15 నుంచి ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు స్వీకరిస్తామని ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.మే 1 నుంచి జులై 15 వరకు సిఫారసు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు గతంలో టీటీడీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులు, టీటీడీ బోర్డు సభ్యుల సిఫార్సు లేఖలు చెల్లవని పేర్కొంది. ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని తెలిపింది. వేసవి సెలవుల దృష్ట్యా తిరుమల తిరుపతి దేవస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు ప్రస్తుత యువతలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, సనాతన ధర్మంపై అనురక్తిని కల్పించడమే లక్ష్యంగా టీటీడీ రామకోటి తరహాలో గోవింద కోటిని రెండు సంవత్సరాల కిందట ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో గోవిందకోటి రాసిన యువతకు వీఐపీ దర్శనాన్ని కల్పిస్తోంది. 25 సంవత్సరాలు, లేదా అంతకంటే తక్కువ వయసున్న వారు ఇందుకు అర్హులు. గోవిందుడి నామాన్ని (10,01,116) సార్లు రాస్తే రాసిన వారికి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించనున్నారు.అంతే కాకుండా గోవిందుడి నామాలు కోటిసార్లు రాస్తే వారితోపాటు కుటుంబ సభ్యులందరూ వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకునే అవకాశం కల్పిస్తారు. టీటీడీ సమాచార కేంద్రాలు, పుస్తక విక్రయ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో గోవిందకోటి నామాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 200 పేజీలుండే పుస్తకంలో 39,600 నామాలు రాయవచ్చు. 10,01,116 నామాలు పూర్తి చేయడానికి దాదాపు 26 పుస్తకాలు అవసరమవుతాయి.కోటి నామాల పుస్తకాలను రాయడానికి కనీసం మూడు సంవత్సరాల సమయం పడుతుందని టీటీడీ అంచనా వేసింది. గోవిందకోటి నామాల పుస్తకాన్ని పూర్తి చేసి తిరుమలలోని తిరుమల తిరుపతి పేష్కార్ కార్యాలయంలో అందిస్తే వారికి మరుసటి రోజు వీఐపీ బ్రేక్ దర్శనాన్ని కల్పిస్తామని పేష్కార్ రామకృష్ణ వెల్లడించారు.

## విషాదం నింపిన ఆన్‌లైన్ గేమ్స్

- మొన్న కొడుకు.. తండ్రి ఆత్మహత్య



**టీ మీడియా ,మే 13,తిమ్మాపూర్:**
ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడిన ఓ యువకుడు అప్పలపాలై ఆత్మహత్య చేసుకోవడంతో.. కొడుకు మరణాన్ని తట్టుకోలేని తండ్రి కూడా ఆత్మహత్య చేసుకున్న ఘటన కరీనంగర్ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి చెందిన నిఖిల్ రావు (21)అనే యువకుడు కొన్నాళుగా ఆన్‌లైన్ గ్రేమ్స్‌కు బానిసయ్యాడు. ఇలా ఆన్‌లైన్ గేమింగ్ యాప్స్‌లో పెట్టుబడులు పెట్టి అప్పులపాలయ్యాడు. ఇక వాటిని తీర్చలేక రెండు నెలల క్రితం మానసిక ఒత్తిడితో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే కొడుకు చావును తట్టుకోలేని తండ్రి తిరుపతిరావు తాను కూడా చనిపోదామని రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అయితే తిరుపతిరావు పురుగుల మందు తాగడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే ఆసుపత్రికి తరలించారు. రెండ్రోజుల పాటు హాస్పిటల్‌లో చికిత్స పొందుమూ మంగళవారం తిరుపతిరావు మృతి చెందాడు.రెండు నెలల వ్యవధిలో తండ్రి, కొడుకు చనిపోవడంతో వారి కుటుంబ తీవ్ర ఆవేదనకు గురైంది. ఒకే కుటుంబంతో తండ్రి కొడుకుల మరణం ఆ గామంలో విషాదాన్ని నింపింది. అయితే ఇప్పటికే ఎంతో మంది ఆన్లైన్ గేమ్స్ వల్ల అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నా.. ప్రజల్లో మాత్రం మార్పు రావట్లదు. ఆన్‌లైన్ గేమ్స్‌పై పోలీసులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా కొందరు వాటిని పట్టించుకోకుండా పెట్టుబడి పెట్టి నష్టపోయి, అప్పులపాలై..వాటిని కట్టలేక ఇలా ప్రాణాలు తీసుకుంటున్నారు.అయితే ఇన్‌ఫ్లూయెన్సర్లు, సినీ హీరోలు బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేయడం వల్లే ఇలాంటి ఘటనలు పెరిగిపోతున్నాయని కొందరు వ్యక్తులు ఫిర్యాదులు చేయడంతో ఇటీవల సినీ హీరోలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఈ క్రమంలో బెట్టింగ్ ప్రమోషన్స్‌పై విచారణ జరిపేందుకు సిట్‌ను కూడా ఏర్పాటు చేసింది.

## ఇంటి ముందు ప్రత్యక్షమైన విశిష్ట అతిథి


- ఖంగుతిన్న రౌడీ షీటర్లు..!



**టీ మీడియా ,మే 13,తెనాలి:**
రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. మద్యం మత్తులో దాడులకు పాల్పడుతున్నారు. కిడ్నాప్‌లు చేస్తున్నారు. స్థానికులను వేధిస్తూ.. భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గుంటూరు ఎస్పీ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే నేరుగా తెనాలిలో ప్రత్యక్షమయ్యారు. ఏకంగా రౌడీ షీటర్ల ఇంటి లోపలికే వచ్చేశారు జిల్లా ఎస్పీ. గుంటూరు జిల్లా రూరల్ ఎస్పీ సతీష్ కుమార్‌ను చూసిన రౌడీ షీటర్లు ఒక్కసారిగా షాక్ అయ్యారు.గత కొంతకాలంగా గుంటూరు జిల్లాలో రౌడీ షీటర్ల ఆగడాలు మీతిమీరుతున్నాయి. అమాయకులను వేధిస్తూ, కిడ్నాపులకు తెగబడుతున్నారు. ఇటీవల కాలంలో కేసుల సంఖ్య పెరుగుతుండటంతో రౌడీ షీటర్ల కదలికలపై జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే రౌడీ షీటర్ల పై పీడీ యాక్ట్ కూడా అమలు చేస్తున్నారు. అంతేకాదు రానున్న రోజుల్లో నగర బహిష్కరణ అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.గుంటూరు జిల్లా రూరల్ ఎస్పీ సతీష్ కుమార్ ఆకస్మికంగా తెనాలి పట్టణంలో ప్రత్యక్షమయ్యారు. ముఖ్యంగా రౌడీషీటర్ల ఆగడాలకు చెక్ పెట్టేందుకు పాండురంగ పేట, ఎడ్ల లింగయ్య కాలనీ, ఐతానగర్, గంగానమ్మపేట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనే నేరుగా రౌడీ షీటర్ల నివాసాలకు వెళ్లి, ప్రస్తుతం వారి ప్రవర్తనపై ఆరా తీశారు. రౌడీ షీటర్లు క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ వెళుతున్నారా లేదా అనే విషయాన్ని, వాళ్ళ ప్రవర్తనను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులు చూడాలని చెప్పారు. రౌడీ షీటర్ల ప్రవర్తనలో మార్పు గమనిస్తే, స్థానికులు వెంటనే ఆ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.రౌడీ షీటర్ల కుటుంబ సభ్యులకు, పోలీసులకు పలు సూచనలు చేశారు ఎస్పీ సతీష్ కుమార్. పట్టణంలోని 2 టౌన్, 3 టౌన్ లిమిట్స్ లో గల రౌడీ షీటర్లపై నిఘా పెంచామన్నారు జిల్లా ఎస్పీ. ఇటీవల కాలంలో తెనాలిలో చోటు చేసుకున్న సంఘటన నేపథ్యంలో, రౌడీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నట్లు ఆయన తెలిపారు. వారిపై ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇప్పటికే రౌడీషీటర్లపై పిడి ఆక్ట్ పెట్టడం జరిగిందని, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద రౌడీ షీటర్ల ప్రవర్తనను బట్టి ఐదు లక్షల వరకు బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. నగదు చెల్లించని పక్షంలో జైలుకు పంపిస్తామన్నారు. ఇప్పటికే ఒక వ్యక్తికి జైలు శిక్ష పడినట్లు తెలిపారు. జిల్లాలో రౌడీ షీటర్ల ప్రవర్తనపై,పూర్తిస్థాయిలో చర్యలు చేపడతామని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు.

## గేమ్ ఛేంజర్ స్కీమ్‌కు సిబిల్ స్కోర్ షాక్

- దరఖాస్తుదారుల పరేషాన్




**టీ మీడియా, మే 13,హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణలో రాజీవ్ యువ వికాసం స్కీమ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారెంటీల్లో భాగంగా గేమ్‌ఛేంజర్ పథకంపై యువతకు భరోసానిచ్చింది. సబ్సిడీ రుణాల కోసం 16 లక్షల మంది దరఖాస్తు చేస్తున్నారు.వాటి స్క్రూటిని కూడా శరవేగంగా సాగుతోంది. కానీ సడెన్ సిబిల్ నిబంధనలు దరఖాస్తుదారులను పరేషాన్ చేస్తున్నాయి. సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే.. వారి దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించే అవకాశం ఉందంటున్నారు అధికారులు. అలానే గతంలో గృహ, వ్యవసాయ, వాహన లేదా పర్సనల్ లోన్స్ తీసుకొని తిరిగి చెల్లించని వారి దరఖాస్తులను కూడా రిజెక్ట్ చేస్తారని సమాచారం.లోన్ అప్లికేషన్‌కు ముందు సిబిల్ స్కోర్‌ను తప్పనిసరిగా పరిశీలించనున్న బ్యాంకులు, దానికి సంబంధించి ఫీజు కూడా వసూలు చేయనున్నాయి. ప్రతి అప్లికేషన్‌కి రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేసే యోచనలో కొన్ని బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాయి.తక్కువ ఆదాయ వర్గాల అభ్యర్థులపై భారం పడకుండా చూడాలనే ఉద్దేశంతో బ్యాంకులు వసూలు చేసే ఫీజును మినహాయించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ అంశాన్ని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు నివేదించనున్నారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (%బూదీజ%) సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది. తెలంగాణ వ్యాప్తంగా ఈ పథకానికి 16,25,441 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం మండల స్థాయిలో దాదాపు 90 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు అధికారులు తెలిపారు. తుది జాబితా ఈ నెలాఖరులో అందుబాటులోకి రానుంది. మండల అధికారులు పరిశీలించిన దరఖాస్తులను బ్యాంకులకు పంపించి అర్హుల ఎంపిక జరుగుతుంది. తుది జాబితా తయారైన తర్వాత అదే కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి అందజేస్తారు. సిబిల్ స్కోర్ తమ ఆశలకు గల్లంతు చేస్తుందా?అనే ఆందోళన వున్నా..సర్కార్ వారి మాట ప్రకారం తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో ఉన్నారు అర్హులు.జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు రుణాల మంజూరు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. మొదటి విడతలో సుమారు 5 లక్షల మందికి ఈ పథకం ప్రయోజనం అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిని కల్పించేందుకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తుంది. ఈ పథకం ద్వారా సొంత బిజినెస్ పెట్టాలనుకునే యవతకు ఆర్థిక సాయం చేయనున్నారు. రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు సబ్సిడీతో కూడిన లోన్స్ బ్యాంకుల ద్వారా మంజూరు చేయనున్నారు.